క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

మద్దిపాడు: మండలంలోని అన్ని గ్రామాలతో సహా గుండ్లాపల్లి గ్రోత్ సెంటర్‌లో కూడా శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ చెన్నారెడ్డి తెలిపారు. విద్యుత్ లైన్ల కింద ఉన్న చెట్లు కొట్టివేయాల్సి ఉందని, విద్యుత్ సబ్ స్టేషన్లు మెయింటెనెన్స్ చేయడం, విద్యుత్ స్తంభాలను సరిచేయడం, మైనర్ రిపేర్లు వంటి పనులు చేయించే క్రమంలో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు వివరించారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఆర్థిక లావాదేవీలను సరిచూసుకోండి

చీమకుర్తి: పల్లామల్లి సహకార సంఘంలో సభ్యత్వం కలిగిన వారు తమ ఆర్థిక లావాదేవీల వివరాలను సరిచూసుకోవాలని విచారణాధికారి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 10 నుంచి 12వ తేదీ వరకు ఈ విచారణ జరుగుతుందన్నారు. రుణాలు పొందిన రైతులు తిరిగి చెల్లించిన రసీదులు, డిపాజిట్లకు సంబంధించిన ఆధారాలు తీసుకొచ్చి సరిచూసుకోవాలని చెప్పారు.

7,8, 9 తరగతుల సీట్లు భర్తీకి ప్రకటన

వలేటివారిపాలెం: మండలంలోని చుండి ఆదర్శ పాఠశాల 2024–25 విద్యా సంవత్సరానికి గాను 7,8,9వ తరగతిలో గల మిగతా సీట్లను భర్తీ చేసేందుకు దరఖాస్తు చేసుకోవాలని పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీ వెంకటేశ్వర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఈ నెల 10వ తేదీ లోపు విద్యార్థులు దరఖాస్తులు అందజేయాలని తెలిపారు. విద్యార్థి, తల్లి , తండ్రి ఆధార్ కార్డుల జెరాక్స్‌లు, రెండు ఫొటోలు పాఠశాలకు తీసుకొచ్చి దరఖాస్తు చేసుకోవాల్సిందిగా తెలిపారు. పరీక్షలు నిర్వహించి మెరిట్ ప్రకారం సీట్లు భర్తీ చేస్తామని తెలిపారు. 7వ తరగతి స్టేట్ సిలబస్ అలాగే 8,9వ తరగతుల విద్యార్థులకు సెంట్రల్ సిలబస్‌పై పరీక్షలు నిర్వహించనునట్లు తెలిపారు.

వీధిలైట్లు వెలిగేలా చర్యలు చేపట్టండి

సింగరాయకొండ: గ్రామ పంచాయతీ పరిధిలో వీధిలైట్లు సక్రమంగా వెలిగేలా జాగ్రత్తలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావుకు ఒంగోలు డీఎల్‌పీఓ పద్మ సూచించారు. మండలంలోని సోమరాజుపల్లి పంచాయతీ కార్యాలయాన్ని శుక్రవారం ఆమె ఆకస్మిక తనిఖీ చేశారు. డీఎల్‌పీఓ మాట్లాడుతూ గ్రామంలోని పకీరుపాలెం, బ్రాహ్మణకాలనీ, సాయినగర్‌లో వీధిలైట్లు సక్రమంగా వెలగడం లేదని ఫిర్యాదులు వస్తున్నాయని, వెంటనే సమస్య పరిష్కరించాలని కార్యదర్శిని ఆదేశించారు. పంచాయతీలో సర్టిఫికెట్లకు అదనంగా డబ్బు వసూలు చేస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. మూలగుంటపాడు కార్యదర్శి రామారావు పాల్గొన్నారు.

రేషన్ పంపిణీ తనిఖీ

కొండపి(సింగరాయకొండ): కొండపి మండలంలోని కొండపి, ఇలవర, నెన్నూరుపాడులో రేషన్ పంపిణీని తహసీల్దార్ కిరణ్ కుమార్ మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. లబ్ధిదారులకు రేషన్ సక్రమంగా అందించాలని సూచించారు. రేషన్ పంపిణీ సక్రమంగా జరుగుతుందా లేదా అని లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట కొండపి వీఆర్‌ఓ సుశీల, ఇతర వీఆర్‌ఓలు ఉన్నారు.

కొండపిలో భారీ వర్షం

కొండపి (సింగరాయకొండ): కొండపి మండలంలో అన్ని గ్రామాల్లో మెరుపులు, గాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. దీంతో అన్ని గ్రామాల్లోని రహదారులు వర్షపు నీటితో నిండాయి. స్థానిక పొదిలి రోడ్‌లో పోలీస్ స్టేషన్ దగ్గర మోకాటి లోతు నీరు ఉండంతో వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బంది పడ్డారు. కొన్ని వాహనాలకి సైలెన్సర్‌లలో నీరు పోవడంతో వాహనాలు అక్కడే ఆగిపోయాయి. దీంతో వాహనాలను తోసుకుంటూ రిపేర్ దుకాణాలకు తీసుకొని రిపేరు చేయించుకొని వెళ్లారు.

మార్కాపురంలో మోస్తరు వర్షం

మార్కాపురం: నైరుతి రుతు పవనాల ప్రభావంతో గురు, శుక్రవారాల్లో కురిసిన వర్షాలకు కొండవాగు, ఉప్పవాగు, గుండ్లకమ్మలో నీరు చేరింది. వాతావరణం ఒక్కసారిగా చల్లబడటంతో ప్రజలు ఉపశమనం పొందారు.

కూచిపూడిలో జ్ఞానశ్రీ ప్రతిభ


జ్ఞానశ్రీని అభినందిస్తున్న శివం ఫౌండేషన్ నిర్వాహకులు

- శివం ఫౌండేషన్ అభినందనలు

ఒంగోలు మెట్రో: స్థానిక సంతపేటలోని శివం శరణాలయంలో కూచిపూడి నాట్యంలో అద్భుత ప్రతిభ చూపిన చిన్నారి జ్ఞానశ్రీని అభినందిస్తూ శివం ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం జ్ఞాపికతో సత్కరించారు. ఈ సందర్భంగా ఒంగోలు నగర అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు మారెళ్ల సుబ్బారావు మాట్లాడుతూ.. ఒంగోలు వాసి ఆళ్ల హరికృష్ణ, సుప్రజ దంపతుల చిన్న కుమార్తె జ్ఞానశ్రీ ఏడేళ్ల వయసులోనే కూచిపూడి నృత్యంలో నాట్య మయూరి అవార్డు, ఆస్కార్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు, నేషనల్ బాలరత్న అవార్డు, నేషనల్ నాట్య రత్న అవార్డు, లిటిల్ చాంప్ అకాడమీ ఆఫ్ ఇండియా వారి సరస్వతి, నటరాజ అవార్డులు పొందడం అభినందనీయమన్నారు. శివ సాయి నాట్యాలయంలో డాక్టర్ పావని చైతన్య గత రెండేళ్లుగా జ్ఞానశ్రీకి కూచిపూడి నృత్యంలో శిక్షణ ఇచ్చారని తెలిపారు. శివం ఫౌండేషన్ చైర్మన్ గొల్లపూడి శ్రీహరి మాట్లాడుతూ.. చదువుతోపాటు కూచిపూడి నృత్యంలో ఉన్న స్థితికి చేరాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా శివం శరణాలయం లోని వృద్ధులకు పండ్లు కాయలు భోజనం నగరంలోని పేదలకు 300 మందికి అన్నదానం చేశారు. కార్యక్రమంలో జ్ఞానశ్రీ బంధుమిత్రులతోపాటు మల్లవరపు శ్రీనివాసరావు చౌదరి, సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారికి మేల్ చాట్ వస్త్రాల సమర్పణ


మేల్ చాట్ వస్త్రాలతో లక్ష్మి, శ్రీనివాసరావు దంపతులు

ఒంగోలు మెట్రో: శ్రీగిరి ఆలయంలో వెంకటేశ్వర స్వామి వారికి ఒంగోలుకు చెందిన బాపట్ల శ్రీనివాసరావు, లక్ష్మి దంపతులు శుక్రవారం మేల్ చాట్ వస్త్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు వేద పండితులు ఆశీర్వచనం అందజేశారు. ఆలయ చైర్‌పర్సన్ ఆలూరు ఝాన్సీరాణి, అర్జిత సేవల ధర్మకర్త ఆలూరు జ్వాలా రామారావు, కార్య నిర్వహణ ధర్మకర్త సీవీ రామకృష్ణారావు, ధర్మకర్తలు ఆలూరు వెంకటేశ్వరరావు, ఆలూరు లక్ష్మీ కుమారి అభినందించారు. శుక్రవారం శ్రీవారికి నిర్వహించే ప్రత్యేక అభిషేకాన్ని తిలకించేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. భక్తులకు శ్రీవారి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లల గుర్తింపు

కనిగిరి రూరల్: ప్రత్యేక అవసరాలు కలిగిన (0–18 ఏళ్ల లోపు) పిల్లలను మండలంలో 62 మందిని గుర్తించినట్లు మండల విద్యాశాఖ అధికారులు ఎంవీ సుబారావు, యువీ నారాయణరెడ్డి తెలిపారు. శుక్రవారం వారు విలేకర్లతో మాట్లాడారు. మే 1 నుంచి జూన్ 9 వరకు బడి ఈడు పిల్లల గుర్తింపు కార్యక్రమం (డోర్ టు డోర్ సర్వే) గ్రామాల్లో నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఐఈఆర్‌పీ ఉపాధ్యాయులు జి. గోపాల కృష్ణ, ఎం. సైమన్‌లు సర్వే ద్వారా విద్యార్థులను గుర్తించి, వారిని ఆయా గ్రామాల్లోని పాఠశాలల్లో పేర్లు నమోదు చేస్తామని వివరించారు.


ఇంటింటి సర్వేలో ఐఈఆర్‌పీలు

సేంద్రియ ఎరువులతో భూములు సారవంతం

- రసాయనిక ఎరువులతో పెట్టుబడి భారం
- అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారులు
- సేంద్రియ ఎరువులతోనే భూమికి మెండుగా పోషకాలు


పొలంలో తోలిన సేంద్రియ ఎరువు

కొనకనమిట్ల: భూములు సారవంతమై అధిక దిగుబడి సాధించాలంటే సేంద్రియ ఎరువుల వినియోగం తప్పనిసరి. పూర్వపు రోజుల్లో రైతులంతా వేసవిలో తమ పొలాలల్లో సేంద్రియ ఎరువులు చల్లి సాగుకు సిద్ధం చేసేవారు. కాలక్రమంలో రసాయన ఎరువుల వినియోగం పెరగడం, పెట్టుబడి భారంగా మారడంతో మళ్లీ పాత పద్ధతినే అనుసరించేందుకు రైతులు మొగ్గుచూపుతున్నారు. వారి ఆలోచనలకు అనుగుణంగానే వ్యవసాయశాఖ అధికారులు సేంద్రియ ఎరువుల వాడకంపై రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. ఈ నేపథ్యంలో గ్రామాల్లో సేంద్రియ ఎరువులకు డిమాండ్ పెరుగుతోంది.

భూసారం పెంపుపై దృష్టి

భూసారం పెంపొందించేందుకు రైతులు పశువుల పేడ, గొర్రెలు, మేకల ఎరువు, చెరువులు, కుంటల్లో పేరుకుపోయిన రేగడి మట్టిని పొలాలకు తోలుతున్నారు. పశు సంపద లేని రైతులు మాత్రం సేంద్రియ ఎరువును కొనుగోలు చేసి పొలాలకు తరలిస్తున్నారు. ఖరీఫ్, రబీ పంటలు సాగు చేసే రైతులు ముందస్తుగా ఎరువులు తోలి పొలాలను సిద్ధం చేస్తున్నారు. తొలకరి వర్షాలు పడిన తరువాత జిల్లాలో ఎక్కువగా కంది, పత్తి, వేరుశనగ, సజ్జ, కూరగాయల పంటలు సాగు చేస్తారు. అంతే కాకుండా అంతర పంటల సాగుకు రైతులు మొగ్గు చూపుతారు. మార్కెట్‌లో సేంద్రియ ఉత్పత్తులకు డిమాండ్ పెరుగుతుండటం కూడా రైతుల్లో మార్పునకు ఓ కారణం.

రసాయన ఎరువులతో అదనపు భారం

పంటలకు రసాయనిక ఎరువులు వాడే రైతులు అధిక ఖర్చు చేయాల్సి వస్తోంది. తద్వారా పెట్టుబడి పెరగడమే కాకుండా చీడ పురుగులు, తెగుళ్ల వీడక పంట దిగుబడి తగ్గుతోంది. ఈ విషయాలపై వ్యవసాయశాఖ అధికారులు ఎప్పటికప్పుడు రైతులకు జాగ్రత్తలు తెలియజేస్తున్నారు. పంట సాగు, ఎరువుల వాడకం, మట్టి నమూనాలు తదితర విషయాలపై అవగాహన కల్పిస్తున్నారు.

సేంద్రియ ఎరువులతో లాభాలు

సేంద్రియ ఎరువులు వాడటం వలన భూమి సారవంతంగా ఉంటుంది. నీటి సామర్థ్యాన్ని పెంచుతుంది. పంటకు మేలు చేసే సూక్ష్మజీవులు వృద్ధి చెంది పంట దిగుబడి పెరిగే అవకాశం ఉంటుంది. సేంద్రియ ఎరువుల వినియోగంతో భూమిలో చౌడు, ఉప్పు లవణాలు తగ్గి పంట ఉత్పత్తి పెరుగుతుంది. మొక్కలకు అవసరమైన పొటాషియం, నత్రజని, కాల్షియం, బోరాన్, జింక్ లాంటి పోషకాలు సేంద్రియ ఎరువుల్లో లభిస్తాయి. అంతేకాకుండా చీడ పీడలను నివారించడానికి దోహదపడతాయి.

> సేంద్రియ ఎరువులు వాడే రైతులకే అధిక దిగుబడి

సేంద్రియ ఎరువులు వాడే రైతులకు పంట దిగుబడి ఎక్కువగా వస్తుంది. ఆ దిశగా రైతులకు అవగాహన కలిపిస్తున్నాం. గ్రామాల్లో రైతులకు వర్మీ కంపోస్టు తయారీ విధానం, భూసార పరీక్షలు, సేంద్రియ ఎరువుల వాడకం, రైతులకు సబ్సిడీతో ఇచ్చే పరికరాలపై అవగాహన కల్పిస్తున్నాం. ఖరీఫ్ సాగుకు సంబంధించి అవసరమైన విత్తనాలను అందించేందుకు చర్యలు చేపట్టాం. అలాగే జింక్, జిప్సం, బోరాన్ అందుబాటులో ఉంచడానికి చర్యలు తీసుకుంటున్నాం.

– ప్రసన్న రంగలక్ష్మి, ఏఓ


పొలంలో వేసేందుకు పశువుల ఎరువు తోలుతున్న రైతులు


పొలంలో ఎరువు చల్లుతున్న మహిళలు

క్విస్ కాలేజీలో ఎమర్జింగ్ టెక్నాలజీస్ వర్క్‌షాప్


శిక్షణ ఇస్తున్న ప్రొఫెసర్ రామకృష్ణుడు

ఒంగోలు: స్థానిక క్విస్ ఇంజినీరింగ్ కాలేజీలో శుక్రవారం ఎమర్జింగ్ టెక్నాలజీస్ ఇన్ కంప్యూటర్ సైన్స్ అనే అంశంపై వారం రోజుల ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ కార్యక్రమం ప్రారంభమైంది. ఇందులో భాగంగా కంప్యూటర్ సైన్స్, ఐటీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ , మెషీన్ లెర్నింగ్ విభాగాల్లో క్విస్ కాలేజీతోపాటు ఇతర కాలేజీల్లోని అధ్యాపకులకు శిక్షణ ఇచ్చారు. వరంగల్ ఎన్ఐటీ కంప్యూటర్ సైన్స్ ప్రొఫెసర్ టి.రామకృష్ణుడు నేచురల్ లాంగ్వేజ్ ప్రాసెస్ ద్వారా శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో కాలేజీ చైర్మన్ డాక్టర్ నిడమానూరి సూర్య కళ్యాణ్ చక్రవర్తి, వైస్ చైర్మన్ గాయత్రి, ప్రిన్సిపాల్ డాక్టర్ వైవీ హనుమంతరావు పాల్గొన్నారు.

ఈవోపీఆర్డీ సేవలు అభినందనీయం


వేణుకుమారి దంపతులను సన్మానిస్తున్న ఎంపీపీ దంపతులు, ఎంపీడీవో

నాగులుప్పలపాడు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో విస్తరణాధికారిగా సేవలందించి ఉద్యోగ విరమణ పొందిన ఏవీవీ కుమారి సేవలు అభినందనీయమని మండల పరిషత్ అధ్యక్షురాలు నలమలపు అంజమ్మ కృష్ణారెడ్డి అన్నారు. ఈవోపీఆర్డీగా సేవలందించి గత నెల 31వ తేదీ ఉద్యోగ విరమణ పొందిన వేణుకుమారి, తాతయ్య దంపతులను శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ దంపతులు అంజమ్మ కృష్ణారెడ్డి, ఎంపీడీవో మహాలక్ష్మి, పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది చేతుల మీదుగా ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కార్యాలయ సూపరింటెండెంట్ మూర్తి, డిప్యూటీ తహసీల్దార్ జయలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రాచీన నాట్య కళల ప్రోత్సాహమే లక్ష్యం


విజేతలతో నిర్వాహకులు

పొదిలి: ప్రాచీన నాట్య కళల ప్రోత్సాహమే లక్ష్యంగా సంస్థ పనిచేస్తుందని మయూరి డ్యాన్స్ అండ్ మ్యూజికల్ స్కూల్ నిర్వాహకులు శివశంకర్ పేర్కొన్నారు. స్థానిక ప్రైవేట్ ఫంక్షన్ హాల్లో కూచిపూడి, భరతనాట్యం, జానపద నృత్యాల పోటీలు జరిగాయి. ఎక్సలెన్స్ అవార్డుల పంపిణీలో భాగంగా నిర్వహించిన కార్యక్రమంలో శివశంకర్ మాట్లాడుతూ.. భారతీయ కళలను, సంప్రదాయాలను భవిష్యత్ తరాలకు అందించాలనే లక్ష్యంతో నాట్య కళలను ప్రోత్సాహిస్తున్నట్లు చెప్పారు. పాశ్చాత్య పోకడ కంటే భరతనాట్యం, కూచిపూడి, జానపద నృత్యాల్లో అద్భుతమైన కళ దాగి ఉందన్నారు. లిటిల్ హార్ట్స్ సంస్థ చైర్‌పర్సన్ వరికూటి శిరీష మాట్లాడుతూ.. కళలకు ప్రోత్సాహంలో భాగంగా తన వంతు సహకారం అందించినట్లు చెప్పారు. మరింతగా తాను సహకారం అందజేస్తానని చెప్పారు. పలు ప్రాంతాల నుంచి వచ్చిన చిన్నారులు చేసిన నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. విజేతలకు శిరీష చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. కార్యక్రమానికి న్యాయ నిర్ణేతలుగా కంఠీరవ శేషుబాబు, కూచిపూడి నాట్యాచార్యులు జె.వీరభద్రరావు వ్యవహరించారు.


షీల్డ్ అందుకుంటున్న విజేత

ఘనంగా విశాల్ జన్మదిన వేడుక


విశాల్ జన్మదిన వేడుకలో పాల్గొన్న మాజీ మంత్రి సురేష్

మార్కాపురం: స్థానిక శామ్యూల్ జార్జి ఇంజినీరింగ్ కళాశాలలో మాజీ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ కుమారుడు, కళాశాల సెక్రటరీ విశాల్ పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాజబాబు, డీన్ మస్తానయ్య, సిబ్బంది జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ పీపీఎస్ నాయక్, వైవీ ఆదిసత్యనారాయణ, ఎం.వెంకటేశ్వర్లు, టీపీఓ ప్రొఫెసర్ డి.కుమార్, ప్రొఫెసర్లు డేనియల్, ఎన్ఎస్ఎస్ పీఓ సురేష్‌కుమార్, ఎన్‌సీసీ ఏఎన్ఓ కల్నల్ అనీల్, వివిధ విభాగాధిపతులు, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

వర్షాలతో చెరువుకు చేరిన నీరు

త్రిపురాంతకం: వర్షాలు కురుస్తుండటంతో హర్షం వ్యక్తమవుతోంది. తరుచూ కురుస్తున్న వర్షాలకు భూములు పదునెక్కాయి. చెరువులకు నీరు చేరుతోంది. ఇటీవల కురిసిన వర్షాలకు త్రిపురాంతకం చెరువుకు నీరు చేరింది. ఇటీవల కాలంలో చెరువుకు నీరు చేరని పరిస్థితులు ఉండగా చాలాకాలం తర్వాత ఈ ఏడాది అడపా దడపా కురుస్తున్న వర్షాలకు చెరువుకు నీరు చేరడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పరిసర ప్రాంతాల్లో బోర్లు ఎండి నీరు రాని పరిస్థితులు ఉండగా చెరువుకు నీరు చేరడంతో బోర్లకు నీరందే అవకాశాలు మెరుగయ్యాయని రైతులు తెలుపుతున్నారు. వ్యవసాయ పనులు ప్రారంభించేందుకు దుక్కులు దున్నుకునేందుకు అనుకూల వాతావరణం ఏర్పడిందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.


వర్షాలకు త్రిపురాంతకం చెరువుకు చేరిన నీరు

పెద్దదోర్నాలలో ఆకస్మిక వర్షం

పెద్దదోర్నాల: కొద్ది రోజులుగా మండుటెండలు, తీవ్ర ఉక్కపోతలతో అల్లాడిన మండల ప్రజలు శుక్రవారం కురిసిన భారీ వర్షానికి కొంతమేర సేద తీరారు. కొద్ది రోజులుగా ప్రచండ భానుడి తీవ్రతతో బెంబేలెత్తి బయటకు వచ్చేందుకు సైతం భయపడిన ప్రజలు అకస్మాత్తుగా ఈదురు గాలులతో కురిసిన వర్షంతో ఊపిరిపీల్చుకున్నారు. సుమారు 44 డిగ్రీల ఉష్ణోగ్రతలతో రోడ్లపైకి సైతం వచ్చేందుకు భయపడిన ప్రజలు శుక్రవారం కురిసిన వర్షంలో సేద తీరారు. గతంలో తీవ్ర ఎండలు అల్లాడించటంతో వీధులన్నీ సాయంత్రం 6 గంటల వరకు నిర్మానుష్యంగా కనపడేవి. శుక్రవారం మధ్యాహ్నం 12.15 గంటల నుంచి అర గంట పాటు వదలకుండా కురిసిన వర్షంతో ఒక్కసారిగా వాతావరణం చల్లగా మారిపోయింది. దీంతో వడగాల్పుల స్థానంలో చల్లటి గాలులు వీస్తుండటంతో 3.30 గంటలకే ప్రజలు రోడ్లపైకి చేరుకున్నారు. కాగా కురిసిన వర్షంతో మండల కేంద్రంలోని లోతట్టు ప్రాంతాల్లో పలు వీధులు వర్షపు నీటితో నిండి మడుగులను తలపించాయి. డ్రైనేజీ కాలువలో నీటితో నిండి పోవటంతో పంచాయతీ సిబ్బంది కాలువలను శుభ్రం చేసే పనిలో లీనమయ్యారు. వర్షం కారణంతో మధ్యాహ్నం 12.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది.

గొడవలకు పాల్పడొద్దు

- దర్శి డీఎస్పీ అశోకవర్ధన్

ముండ్లమూరు: మండలంలో ఎన్నికలు ప్రశాంతంగా ముగిసినందున ప్రజలు సంయమనం పాటించి గొడవలకు దూరంగా ఉండాలని దర్శి డీఎస్పీ అశోకవర్ధన్‌రెడ్డి సూచించారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌ను ఆయన శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో సమస్యాత్మక గ్రామాలపై సిబ్బంది ప్రత్యేక నిఘా పెట్టాలన్నారు. ఎన్నికలు ముగిసినందున రాజకీయ నాయకులు మనస్పర్థలు విడనాడి వివాదాలకు దూరంగా ఉండాలన్నారు. వ్యవసాయ బోర్ల వద్ద ట్రాన్స్‌ఫార్మర్ల నుంచి విద్యుత్ వైరు అపహరించుకు పోయే వారిపట్ల కఠినంగా వ్యవహరించాలన్నారు. సిబ్బంది గ్రామాల్లో నిత్యం పర్యటించి ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. ఆయన వెంట ఎస్ఐ ఆంజనేయులు, సిబ్బంది వెంకటేశ్వర్లు, అంకారావు, మరియబాబు, పున్నారావు, మహేష్, ఏసుబాబు ఉన్నారు.



ఎస్ఐకి సూచనలిస్తున్న డీఎస్పీ అశోకవర్ధన్